క్లుప్తంగా

కడియం శ్రీహరిని కలిసిన నాయకులు



చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి చేరాలు, మాజీ ఎంపీటీసీ ఇసాక్, కడియం యువసేన జిల్లా నాయకుడు జక్కుల రాజయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు సాదం భీమన్న, ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

జనగామ రూరల్: మండలంలోని అడవికేశవాపూర్ గ్రామానికి చెందిన కమల్ల మల్లయ్య బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. కాగా, చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2లక్షల ఎల్‌ఓసీని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బుధవారం అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



జనగామ: అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ మంగళవారం తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కండిగడ్డతండాకు చెందిన బానోత్ తిరుపతి, బానోత్ భద్రమ్మ జనగామ పట్టణంలోని కుర్మవాడలో లబ్ధిదారుల వద్ద నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి గూడ్స్ ఆటోలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆటో సీజ్ చేసి వారిపై ప్రజాపంపిణీ, నిత్యావసరాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. స్వాధీనం చేసిన బియ్యాన్ని పౌరసరఫరాల నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

సంతాపం

చిల్పూరు: రాజవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పింగిళి వెంకటమ్మ (85) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలియగానే పలువురు నాయకులు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. కాగా, పార్టీ జిల్లా నాయకులు మారేపల్లి శ్యాంకుమార్ రెడ్డి, మారేపల్లి కృష్ణమోహన్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్ల ఎల్లయ్య, ఎడ్ల మొగిళి, కడియం యువసేన అధ్యక్షుడు ప్రశాంత్, జక్కుల రాజయ్య, కాల్వ కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి తదితరులు మృతురాలి కుమారుడు, ఆదర్శ రైతు పింగిళి పుల్లారెడ్డిని పరామర్శించారు.

పీరీల ఊరేగింపు



చిల్పూరు: మొహర్రం పండుగను పురస్కరించుకొని శ్రీపతిపల్లిలో పాలబోయిన రాజు ఆధ్వర్యంలో మంగళవారం పీరీల ఊరేగింపు నిర్వహించారు. రంగు హరీశ్, ఉడుత వెంకన్న, ఎండీ ఇమామ్, దిండిగాల రాజయ్య, ప్రశాంత్, వీరయ్య, కనుకయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగికి బదిలీ సహజం

బచ్చన్నపేట: ఉద్యోగులకు బదిలీలు సహజమని మండలంలోని కొన్నె ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణంరాజు అన్నారు. మంగళవారం పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎం.అంబదాసు, జి. శ్రీనివాస్‌లను, నూతనంగా వచ్చిన కృష్ణంరాజు, నాగరాజులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు.

ఎలక్ట్రానిక్ బెల్ అందజేత



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.10 వేల విలువైన ఎలక్ట్రానిక్ బెల్‌ను మంగళవారం అందజేశాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని అన్నారు. ఉపాధ్యాయులు కనుకయ్య, రామచెంద్రం, పృథ్వీరాజ్, యాదగిరి, బాలరాజు పాల్గొన్నారు.

ఎస్సై శ్రీనివాస్ మృతిపై విచారణ చేపట్టాలి

జనగామ రూరల్: అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవదానం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. శ్రావణ్ కుమార్, లలిత, యాదగిరి, సుల్తానా, కృష్ణ పాల్గొన్నారు.

అంగడి ఆవరణ అధ్వానం

- ఇబ్బంది పడుతున్న ప్రజలు, భక్తులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అంగడి ఆవరణలో నిలిచిన మురుగు నీరు



వాటర్ ట్యాంకు చుట్టూ నిలిచిన మురుగు నీరు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు సేద తీరే అంగడి ఆవరణ చినుకు పడితే చిత్తడై అధ్వానంగా మారుతోంది. వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో భక్తులతోపాటు గుట్ట కింద అంగడిలో ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయానికి అంగడితో ఆదాయం వస్తున్నా సంబంధిత అధికారులు, పాలకులు అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు అంగడిలో ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచి మురికి గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలు ఎక్కువయ్యాయని వాపోతున్నారు. భక్తులకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు చుట్టూ మురుగునీరు చేరడంతో నీటిని కొనుక్కునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నీరు నిల్వ కుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

భక్తులకు కనీస వసతులు లేవు



ఆలయానికి వచ్చే భక్తులతో పాటు, అంగడితో ఎంతో ఆదాయం ఉంటుంది. అయినా సంబంధిత ఈఓ, అధికారులు భక్తులకు కనీస వసతులు కల్పించడం లేదు. ఇక్కడ దాతలు కట్టించిన మరుగుదొడ్లు కూడా భక్తులకు అందుబాటులోకి తీసుకరాలేదు.

– పంతం రాజు, స్థానికుడు

దూర ప్రాంతంలో వంట



ఆలయానికి వచ్చే భక్తులు దర్శనం అనంతరం గుట్టకింద అంగడి ఆవరణలో వంట చేసుకుంటారు. కానీ ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి వసతులు కల్పించక పోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి వంటలు చేసుకుంటున్నారు. సౌకర్యాలు కల్పించాలి.

– నారగోని రవి, స్థానికుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



అంగడి ఆవరణలో భక్తులకు కనీస సౌకర్యాలు లేవన్నది గుర్తించాం. ఎలాంటి సమస్య తలెత్తకుండా వెంటనే చర్యలు తీసుకునేందుకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– యాదవరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సరుకులను పరిశీలిస్తున్న ఎంపీఓ

తరిగొప్పుల: విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీఓ ఆగా మిస్బా ఆలాం హెచ్చరించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యాసిడ్ కలిసిన వాటర్ తాగి విద్యార్థిని అస్వస్థతకు గురికాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన మంగళవారం తనిఖీ చేశారు. వాటర్ బాటిల్ లో యాసిడ్ కలుపుతుంటే ఏం చేశారని పాఠశాల ప్రత్యేక అధికారిని గోవిందు రజిత, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వంటగది, నిత్యావసర సరకులు, కూరగాయలు భద్రపరిచే ప్రాంతాన్ని పరిశీలించారు. వంటగది పరిశుభ్రంగా ఉంచి, కూరగాయాలపై దోమలు, ఈగలు వాలకుండా చూసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు భూక్య లింగం, భాగ్యలక్ష్మి ఉన్నారు.

సిబ్బందిని నియమించాలి



వినతి పత్రం ఇస్తున్న ఫ్లోర్ లీడర్ హరిశ్చంద్ర గుప్త

జనగామ: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో సిబ్బంది లేక ఇబ్బందవుతోందని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త అన్నారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యాలయంలో డీఈ వారినికి ఒక రోజు, ఏఈ మూడు రోజులు మాత్రమే పని చేస్తున్నారని, దీంతో పనులు ఆగిపోతున్నాయన్నారు. శానిటేషన్ పనులు కూడా జరగడం లేదని, వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు.

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ కన్వీనర్‌గా మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అడ్వకేట్ కనకం రమేశ్‌ను నియమించినట్లు టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్ విభాగం చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కనకం రమేశ్ మంగళవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పదవితో తన బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. లీగల్ సెల్‌కన్వీనర్‌గా నియమించినందుకు ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇందిరలకు కృతజ్ఞతలు తెలిపారు.

దాడి కేసులో తండ్రీ కొడుకుల రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామంలో ఓ మహిళపై దాడి చేసిన తండ్రీ కొడుకులను రిమాండ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన చిలుముల రమణాకర్, పసునూరి రాజు రెండు కుటుంబాలు స్థల హద్దులు, చెత్త, మురుగు నీరు వెళ్లే విషయంలో గొడవ పడి పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దర్యాప్తులో చిలుముల రమణాకర్, అతని కుమారుడు తరుణ్‌లు పసునూరి రాజు భార్యను అవమానించి దాడి చేసిన నేపథ్యంలో ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు

జనగామ రూరల్: గానుగుపహాడ్ క్రాస్ వద్ద బ్రిడ్జి నిర్మాణంలో ఉంది. అయితే జనగామ నుంచి నర్మెటకు వెళ్లేందుకు తాత్కాలికంగ మట్టిరోడ్డు ఏర్పాటు చేశారు. కాగా వర్షాలకు రోడ్డుపై గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కాగా, మంగళవారం రాత్రి గుంతలో పలువురు అప్రమత్తంగా ఉండాలని చెట్ల కొమ్మలను ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామానికి చెందిన భవన నిర్మాణరంగ కార్మికుడు జీడీ నరేశ్ అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన యాట కొమురమ్మ (70) ప్రవీణ్ అనే వ్యక్తి చేతిలో తీవ్రంగా గాయపడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై రవియాదవ్ తెలిపారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

జనగామ రూరల్: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అయిత నిఖిల్ హాజరై జెండాను ఆవిష్కరించారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం



కొడకండ్ల: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ రాజీలేని పోరాటం చేస్తూ ముందంజలో నిలుస్తుందని బీజేపీ నాయకుడు కోటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా వందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఎన్నిక

పాలకుర్తి టౌన్: మండల దివ్యాంగుల సేవా సమితి నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా తాళ్లపల్లి యాకయ్య, ఉపాధ్యక్షుడిగా గాదరి యాదగిరి, కార్యదర్శిగా వంగాల మల్లికాంబ, కోశాధికారిగా నారబోయిన యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆరూరి యాదగిరిలు ఏకగ్రీంగా ఎనికయ్యారని నియోజకవర్గ అధ్యక్షురాలు శివరాత్రి సుగుణ ప్రకటించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న భాగిర్తి కొమురయ్య ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పి.తిరుపతి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన వివరాలు.. కొమురయ్య భార్య ఇటీవల మృతి చెందడంతో ఇంట్లో ఒంటరిగా ఉండలేక పట్టణంలోని కుమారుడి వద్దకు సోమవారం వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం కొమురయ్య రావడంతో ఇంటి, బీరువా తాళ్లాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని బంగారు గొలుసు, చెవికమ్మలు, మట్టెలు, రూ. 60 వేల నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంత్రిని కలిసిన వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్

బచ్చన్నపేట: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క జన్మదినం పురస్కరించుకొని వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన ఈరబత్తిని కాంతం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల సాయం మంగళవారం అందజేశారు.

గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ పనుల పరిశీలన

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో 20 ఏళ్ల క్రింత ప్రారంభించిన గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ పనులను సీపీఎం బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ కాల్వ పనులను వెంటనే పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాలపై చర్య తీసుకోవాలి

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని సెయింట్ మేరీస్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లెంగుల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో డీఈఓ రాముకు వినతి పత్రం అందజేశారు. సంతోష్, అభినయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల దాడులు సరికాదు

జనగామ రూరల్: వాస్తవాలు తెలుసుకోకుండా ఏబీవీపీ నాయకులు పాఠశాలపై దాడి చేయడం సరికాదని సెయింట్ మేరీస్ పాఠశాల డైరెక్టర్ తుమ్మ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జైమాన్ థామస్ అన్నారు. మంగళవారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దకందూరుకు చెందిన అజయ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడని, ఈ నెల 6వ తేదీన విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా ఔటింగ్‌కు కుటుంబీకులు తీసుకెళ్లి సాయంత్రం తీసుచొచ్చారన్నారు. తండ్రితో పాటు విద్యార్థి మామ మద్యం సేవించి వచ్చి పాఠశాలలోకి వస్తామని వార్డెన్‌తో గొడవకు దిగినట్లు తెలిపారు. 8న తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని ఏబీవీపీ నాయకులు పాఠశాలలోని ఫర్నీచర్, పూల మొక్కల కుండీలు ధ్వంసం చేశారన్నారు. యాజమాన్యం వివరణ కోరకుండా ఏపక్షంగా గొడవకు దిగడం సరికాదని, సీసీ కెమెరాలు చూస్తే తప్పు ఎవరిదో తెలుస్తుందన్నారు. అసత్య అరోపనలు మానుకోవాలని అన్నారు.

అప్పిరెడ్డిపల్లెకు ఆర్టీసీ బస్సు



దేవరుప్పుల: మారుమూల పల్లెకు జాతీయ స్థాయిలో వన్నెతెచ్చిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య .. ఆర్టీసీ అధికారులకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలన్న వినతి మేరకు మంగళవారం మాదాపురం షటల్‌బస్సు సర్వీను అప్పిరెడ్డిపల్లెకు విస్తరించారు. సుధాకర్, నవీన్‌రెడ్డి, కొమురయ్య, యాకయ్య పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గణేశ్ తదితరులు

తరిగొప్పుల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డీసీసీ బ్యాంకు దశాబ్ది డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీసీసీబీ మేనేజర్ చుక్క గణేశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం ప్రధాన కూడలి వద్ద రైతులతో కలిసి డిపాజిట్ పథకం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఖాతారులకు పథకంపై అవగాహన కల్పించారు. దశాబ్ది డిపాజిట్ పథకంలో అత్యధికంగా రూ.5 లక్షల వరకు డిపాజిట్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. నెలవారి, త్రైమాసిక వడ్డీ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. డిపాజిట్‌పై 365 రోజులకు అత్యధిక 8.10 శాతం వడ్డీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నర్మెట శాఖ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, సీఈఓ వెంకటయ్య, ప్రజ్ఞాపురం మలయ్య, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు కొట్టివేయాలి



కోర్టు ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యమకారులు

జనగామ: జనగామ జిల్లా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఉద్యమకారులపై కోర్టు కేసులు పోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల నేపథ్యంలో మంగళవారం కోర్టుకు హాజరైన వారు నిరసన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం ఉద్యమకారులపై ఉన్న కేసులను కొట్టివేయాలని డిమాండ్ చేశారు. కోర్టుకు హాజరైన వారిలో మంతెన మణి, మంగళంపల్లి రాజు, పిట్టల సురేష్, తీగల సిద్దుగౌడ్, మహ్మద్ మాజిద్, సతీష్ ఉన్నారు.

వాగు ప్రవాహానికి అడ్డుగా మొరం

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్ శివారులోని రోడ్డుడౌన్ సమీపంలో చెరువు అలుగు వెళ్లే వరద ప్రవాహానికి అడ్డుగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొరం పోయడం వివాదాస్పదంగా మారింది. వాగుపై ఎలాంటి నిర్మాణాలు చేయకుండా, వరద నీరు సాఫీగా వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు మంగళవారం ఎమ్మెల్యే శ్రీహరిని ఆశ్రయించారు. వాగుపై నిర్మాణం చేపట్టేందుకు ఓ రియల్టర్ స్థానికుడితో కలిసి మీటరు ఎత్తుగా కొద్ది దూరం మొరం పోయడంతో.. ఎగువ ప్రాంతం నుంచి వాగు నీరు వచ్చేందుకు ఇదే మార్గం కావడంతో పొలాలు నీట మునిగే అవకాశముందని బాధిత రైతు లోడె నర్సయ్య ఎమ్మెల్యేను వేడుకున్నాడు. వాగు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించాడని నర్సయ్య తెలిపాడు.

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నర్సయ్య

పాలకుర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. మంగళవారం పాలకుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ మహేందర్ రెడ్డితో కలిసి దేవరుప్పుల, కొడకండ్ల, జఫర్‌గఢ్, రాయపర్తి, పాలకుర్తి మండలాల ఎస్సైలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలన్నారు.

పనుల పూర్తికి కృషి



మాట్లాడుతున్న సత్యనారాయణ

పాలకుర్తి: గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులన్నీ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. మంగళవారం గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని ముత్తారం గ్రామంలో మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కొడకండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, నాయకులు భూమ రంగయ్య, బొమ్మగాని భాస్కర్, కృష్ణమూర్తి, నల్లమాస రమేశ్ గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. రాష్ట్ర నాయకుడు గుగ్గిళ్ల ఆదినారాయణ, మాజీ ఎంపీపీలు కారుపోతుల శ్రీనివాస్, కుమార్, యాకస్వామి, మహేందర్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

'రైతు భరోసా' అందించాలి

బచ్చన్నపేట: వానకాలం నాట్లు అయిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను అందించడం లేదని, వెంటనే అన్నదాతలకు ఇవ్వాలని పీఏసీఎస్ డైరెక్టర్ వేముల లక్ష్మణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రైతుల అభిప్రాయం పేరుతో కాలయాపన చేస్తున్నారని, రైతు ప్రయోజనాలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సీత్లా భవానికి పూజలు



చిల్పూరు: నైవేద్యం తీసుకెళ్తున్న మహిళలు



సాంప్రదాయ నృత్యాలు చేస్తున్న గిరిజనులు

చిల్పూరు: మండలంలోని దేశాయితండా గ్రామంలో గిరిజనులు పవిత్రంగా నిర్వహించే సీత్లా భవాని పండగలో భాగంగా మంగళవారం దాటోడి(గొడ్ల దాటుడు) వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు, యువతులు గిరిజనుల సాంప్రదాయ నృత్యాలు చేసుకుంటూ సీత్లా దేవి ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. వేడుకలను పురస్కరించుకుని పంచాయతీ కార్యదర్శి ఎన్నకూస రాజు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పూజారి కిషన్‌నాయక్, బీకునాయక్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, భూక్య శ్రీను, హేమానాయక్, హర్యాకవత్ లాలు, భూక్య స్వామినాయక్, భూక్య వెంకట్, కాలూరాం, కిషన్, బీకూ, రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో..



దేవరుప్పుల: మొండిచింత తండాలో..

దేవరుప్పుల: బంజారాలు సాంప్రదాయ పద్ధతిలో జరుపుకునే సీత్లా భవాని పండుగను మండల కేంద్రంలోని గిరిజన తండాలతోపాటు ధర్మాపురం, మొండి చింతతండా, ధర్మగడ్డ, మాధాపురం, కడవెండి పరిధి గిరిజన తండాల్లో జరుపుకున్నారు.

అభివృద్ధిపై నిర్లక్ష్యం విడనాడాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ రూరల్: పట్టణంలోని బాణాపురం అభివృద్ధిపై మున్సిపల్ చైర్మన్ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బాణాపురం బీటీ రోడ్డుపై నిలిచిన నీటిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం బీటీ రోడ్డు కృంగిపొవడంతో ప్రతీసారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షం నీటితో చెరువును తలపిస్తుంస్తోందన్నారు. వర్షానికి కొన్ని ప్రాంత్రాలు జలమయమై ఇళ్లలోకి నీరు చేరుతుందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. విజేందర్, లింగం, రజిత, వసంత,పద్మ, మమత, నీల, ఆనందం, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

కమిటీల పేరుతో కాలయాపన సరికాదు



ధర్నా చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: రైతు భరోసా, రుణామాఫీ, ధరణి సమస్యల పరిష్కారానికి కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ వెంకన్నకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. బూడిద గోపి, సురేష్, రామచొక్కం, వి, నాగరాజు, ఆనందం, రాములు, బీరయ్య, గట్టయ్య, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.